

# బిజినెస్ ఈజ్ బిజినెస్

**కేఎస్వీ**

ఛార్లీ ఛాప్లిన్ హైదరాబాద్ వొస్తే ఎలా ఉంటుంది?

నిజానికి ఈ ప్రశ్నను మరోరకంగా వెయ్యాలి.

హైదరాబాద్ కొస్తే ఛార్లీ ఛాప్లిన్ కెలా ఉంటుంది?

నేను హాట్ పెట్టుకోను, మడతలు నలిగిన కోటు వేసుకోను, అసలు కోటే వేసుకోను, ఖచ్చితంగా చెప్పగలను, నా ప్యాంటుకి ఎక్కడా చిరుగన్నది లేదు. వేషాన్నిబట్టి కాదు గాని, నాలో ఎంతో కొంత ఛాప్లిన్ అంశ ఉందని నా నమ్మకం. ప్రతివాడిలో అంతో ఇంతో ఆ అంశం ఉంటే ఉండునుగాక, నా కెందుకూ?

ఊళ్ళు తిరగడం సరదా నాకు. ఏ ఊళ్ళో అయినా లక్ష్యం అంటూ లేకుండా సైన్ బోర్డులు చదువుకుంటూ ఏదో పోగొట్టుకున్నట్టు ప్లాట్‌ఫాంపై వెదుకుతూ చెడతిరగడం మహాసరదా. క్లైలిన్ ల్యూటాంగ్ అన్నట్టు దీన్నే 'ది గ్రేట్ ఆర్ట్ ఆఫ్ లోఫింగ్' అంటాను. ఎవరైనా నన్ను లోఫర్ అంటే సిగ్గుపడను సరి కదా, బోలెడు గర్విస్తాను.

మొహమాటానికి బంధువుల పెళ్ళికని హైదరాబాద్ వెళ్ళి ఆ ఉదయం పెళ్ళిలో మొహం చూపించి, మండపం వైపు అక్షింతలు విసిరేశాక, నాకింకా చేయడానికి పనంటూ లేకపోయింది. అప్పుడు చప్పున జగన్ గుర్తొచ్చాడు.

మా కాలేజీ రోజుల్లో దోస్తు జగన్. మెరికలాంటి, చాకులాంటి కుర్రాడు. వాళ్ళది చాలా పేద కుటుంబం. చదువులో మాత్రం టాప్ ర్యాంక్‌లో వుండేవాడు.

బుద్ధి పాదరసమే. నేనేదో గుమాస్తాగిరిలో సెటిలైపోయాను. ఆ తర్వాత అప్పుడప్పుడూ అందే మిత్రుల సమాచారాలలో జగన్ ఎప్పుడూ మెరుపులా మెరిసేవాడు. జీవితంలో చకచకా ముందుకుపోయాడు. ఆరేళ్ళక్రితం ఒక మిత్రుడు చెప్పాడు. జగన్ ఇప్పుడు ఇండస్ట్రీ సైడుకి దిగాడు తెలుసా? అన్నాడు. మరో మిత్రుడు వివరాలు చెప్పాడు. పెట్టుబడి మరెవరిదో నట. జగన్ పార్టనర్‌ట. సాధ్యమే మరి రెండేండ్లకి జగన్ స్వంత బిజినెస్ కంపెనీ పెట్టుకున్నాడని వార్త. ఇది ఎగుమతి దిగుమతుల కంపెనీట. వ్యవహారమంతా లక్షల్లోనే. యూసఫ్‌గూడాలో నాలుగంతస్థుల భవంతి కట్టాడనీ, కారులో తిరుగుతాడనీ, చాలా దర్జాగా బ్రతికేస్తున్నాడనీ సమాచారాలు తెలిశాయి. నెలరోజుల క్రితమే పత్రికల్లో వాక ఫోటో పడింది. ఎగుమతుల్లో సరికొత్త రికార్డు సాధించినందుకు ఎ.సి.బి.సి. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జగన్ మంత్రిగారి నుండి అవార్డు అందుకుంటున్న ఫోటో అదీ. ఆ ఫొటో చూసి నాకేదో చెప్పరాని ఆనందం కలిగింది. కాలేజీ రోజుల తర్వాత జగన్‌ని చూడడం ఆ ఫొటోలోనే. లావెక్కి నునుపుదేలాడే తప్ప. పెద్ద భేదమేమీ కనిపించలేదు కోటులో చాలా హుందాగా మాత్రం ఉన్నాడు. జీవితంలో మనమేమీ సాధించలేకపోయినా, మన బంధువులో స్నేహితులో గొప్పవాళ్ళయిపోతే, అదో తృప్తి, సంతోషం. 'మన' అనుకోవడంలో తేడాయేగాని, లోకంలో ఎవరూ ఏం సాధించినా అందరికీ గర్వకారణమే కదూ?

ఎలాగూ హైదరాబాద్‌కి వచ్చాను గదా, ఒకసారి జగన్‌ని చూసిపోదామని అప్పుడే అనిపించింది. పెళ్ళిలో టిఫిన్ అయినా చెయ్యకుండా, రోడ్డునపడ్డాను. ట్రెయిన్‌కి సాయంత్రందాకా టైముంది. ఈలోగా ఎ.సి.బి.సి.ని అన్వేషించలేనా?

ఎ.సి.బి.సి. ఆఫీసు యూసఫ్‌గూడాలో ఉందని విన్నానే కాని, సరైన అడ్రెస్ నాకు తెలియదు. టెలిఫోన్ డైరెక్టరీ చూసినా తెలుస్తుందేమో కాని, ఛార్లీఛాప్లిన్ అంత ఊరుకోదుగా. యూసఫ్‌గూడా దాకా బస్సులో వెళ్ళిపోయాను. అసలికే ఎండ చురుకెక్కిపోయింది. చెంపలు వాయించేస్తోంది. మెయిన్‌రోడ్ల గుండా తీరిగ్గా వచార్లు కొట్టాను, అన్ని సైన్‌బోర్డులూ చూశాను. ఎ.సి.బి.సి. అక్షరాలు నా కళ్ళపడలేదు.

మనకి తల సరిగ్గా దువ్వుకునే అలవాటే లేదు. ముఖం జిడ్డు కారిపోతున్నా, పట్టించుకోను. చెమట చిత్తడికి చొక్కా వీపు నంటుకుపోతుంటే అదో చిరచిర, ప్రొద్దున టిఫిను కూడా లేదు కదా? ఆకలి కాస్తా ముదిరింది, నీరసం తల తిప్పుతోంది. కనిపించిన ఇరానీ హోటల్‌లోకి

దూరాను. సోనూసాలు తిని, టీ తాగాను. సిగరెట్టు వెలిగించి కాస్సేపు తాత్విక చింతనలో పడ్డాను. నేనిలా వచ్చానని జగన్‌కి తెలియదు కదా? ముందుగా ఉత్తరం రాసుండాల్సింది. ఇప్పుడైనా ఫోన్ చేయాల్సింది. కాని ఛాప్లిన్ ది గ్రేట్ ఒప్పుకోడు. నా ఉద్దేశం జగన్ ఎలా ఉన్నాడో చూడడమే. దానికి ఉపోద్ఘాతాలు అవసరం లేదు.

ఎ.సి.బి.సి.ని కనిపెట్టడానికి ఇక స్వంత తెలివితేటలు చాలవని మెల్లి మెల్లగా జ్ఞానోదయమైంది. సాటి మానవుల సాయం తప్పనిసరి. హోటల్ కౌంటర్లో ఉన్న సాటి మానవుణ్ణి అడిగాను. అతను నన్ను ఎగాదిగా చూశాడు. ఎసిబిసీయో, ఎక్స్‌వైజడ్డో, మాకేం తెలుసు అన్నాడు. ఆ తర్వాత మళ్ళీ రోడ్డెక్కి అన్వేషణ కొనసాగించాను. దేనికైనా ఒక పద్ధతి అంటూ ఉండాలి కదా? ఎగుమతుల కంపెనీ గురించి ఎవరన్నడిగితే తెలుస్తుంది. కిళ్ళీషాపులో అడిగితే తెలుస్తుందా! అయినా అడిగి చూశాను, తెలియలేదు మరో క్రాస్ రోడ్డు దాటింతర్వాత, అప్పుడే ఆటో దిగుతున్న సూటులోని సాటి మానవుణ్ణి అడిగాను. సూటుమానవుడు కరుణా మయుడు ఏసుప్రభువులా నన్ను ఆప్యాయంగా చూసి, ఎ.సి.బి.సి. ఎక్కడో తనకూ తెలియదన్నాడు.

అన్వేషణ మానేసి హాయిగా వెళ్ళి వారింటికి వెళ్ళి భోజనంలాంటిదేదో చేసి హాయిగా ఓ కునుకు తీద్దామనిపించింది. ఛాప్లిన్ ఒప్పుకోలేదు. ఆరంభింపరు నీచ మానవులు... అన్నాడు. జయమ్ము నిశ్చయమ్మురా, అని నేపథ్యం కూడా వినిపించింది. అప్పటికి సూర్యుడు నడి నెత్తికెక్కాడు. తన సహస్రబాహంపులతో అతడ ఖడ్గాలమ ఝుళిపిస్తున్నాడు.

ఆదేదో ఫైనాన్షియల్ కన్సల్టెంట్స్ అని బోర్డు కనిపించింది. వెళ్ళమన్నాడు ఛాప్లిన్. వెళ్ళాను. ఫోనులో మాట్లాడుతున్న బట్టతల నాకేసి నవ్వుతూ, కూచొమ్మని చూసింది, ఛాప్లిన్ కూచొమ్మన్నాడుగాని నేనే కూచోలేదు, రెండు నిమిషాలకు బట్టతల ఫోన్ పెట్టేసి నావైపు ప్రశ్నార్థకంగా చూసింది. ఎ.సి.బి.సి. పేరు చెప్పగానే బట్టతలలో చిన్న వెలుగు మెరిసింది. అమ్మయ్య, అనుకున్నాను. ఎట్టకేలకు జయమ్ము నిశ్చయమ్ము అయింది, యూసఫ్‌గూడాకు ఓ చివరి ఉన్నానట నేను ప్రస్తుతం. ఎ.సి.బి.సి. ఆఫీసు మరో చివర ఉందిట. స్టేట్ బ్యాంకు దాటి మెయిన్‌రోడ్డు మీద తిన్నగా వెళ్ళి బ్రిడ్జి దిగి లెఫ్టుకి వెళ్ళి రైట్‌సైడున మూడో క్రాసులోకి వెళ్తే- ఎ.సి.బి.సి. బోర్డు కనిపిస్తుంది. బట్టతలకు త్రికరణ శుద్ధిగా కృతజ్ఞతలు చెప్పుకున్నాను. బట్టతల మళ్ళీ ఫోనెత్తుతుండగా, నేను రోడ్డెక్కాను.

మళ్ళీ నడక. జేబులో డబ్బుల్లేక

కాదు. బేవార్సుగా నడవడంలో వున్న హాయి ఆటోలో వెళ్తే ఏముంటుంది. దాదాపు ఇరవై నిమిషాలు కాళ్ళీడ్చి ఈస్ట్ బ్లేంట్ బ్యాంకు దాటి మెయిన్ రోడ్డు మీదే తిన్నగా వెళ్ళి బ్రిడ్జి దిగి లెఫ్టుకి వెళ్ళి రైటుకి తిరిగి మూడో క్రాసులోకి వెళ్ళాను. అదే ఎ.సి.బి.సి. ఎత్తుగా ఠీవిగా ఉంది నాలుగంతస్థుల భవనం. ఎ.సి.బి.సి ప్రైవేట్ లిమిటెడ్ ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ అని బ్రౌన్‌రంగు బోర్డుమీద అక్షరాలు మెరుస్తున్నాయి, అదే నన్నమాట జగన్ సామ్రాజ్యం.


రోడ్డు మలుపులో ఉన్న బడ్డీదగ్గర ఆగిపోయాను. సోడా ఒకటి తాగి కాసేపు సేదతీరాను. ఇవన్నీ ఛాప్లిన్ సలహా మేరకే చేశాను. కర్చీఫుతో ముఖం కాస్త తుడుచుకున్నాను. రేగిన జుత్తుని అలాగే చేత్తో సవరించుకున్నాను. జగన్‌ని చూడబోతూ మరీ రికామీగా వెళ్తే బాగుండదు కదా అతనికింద పనిచేసేవాళ్ళందరూ ఏమనుకుంటారు?

బడ్డీ దగ్గర్నుంచి కదులుదామనుకునే లోపలే ఓ పెద్ద కారు రయ్యిమని నన్ను దాటుకుని వెళ్ళి ఎ.సి.బి.సి. ముందు ఆగింది. కారు వెనుకసీటులో మనిషి జగన్ కాదు గదా అని అనుమానించే లోపలే కారు ఆ గేటు ముందు ఆగడం, డ్రైవర్ దిగి వెనుక డోరు తీయగా ఫుల్‌సూటులో ఉన్న జగన్ హుందాగా దిగి, వాచ్‌మన్ సెల్యూట్‌ని తలతాటింపుతో అందుకుంటూ లోపలికి వెళ్ళిపోవడం అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.

ముందుకు వెళ్ళబోయిన వాణ్ని బడ్డీ దగ్గరే మరి కాస్సేపు ఉండిపోయాను. తనకోసం వచ్చి ఇలా వీధి మీదే ఆగిపోయానంటే జగన్ ఏమనుకుంటాడో.

నేను వెంటనే లోపలికి వెళ్ళలేదంటే దానికి బలవత్తరమైన కారణం ఉంది. ఎక్కడినుంచోగానీ, జగన్ ఇప్పుడే వచ్చాడు కదా వెంటనే ఆఫీసులో కాస్త హడావుడి వుంటుంది. ఉద్యోగులు బాస్ ఉత్తర్వులకోసం ఎదురుచూస్తూంటారు. అంతా సర్దుకునేసరికి కాసేపు పడుతుంది.

కాస్సేపు బడ్డీ దగ్గరే వుండిపోయి, నెమ్మదిగా నడిచాను ఏ.సి.బి.సి. వైపు. గేటులో వాచ్‌మన్ ఆపాడు. జగన్‌గార్ని కలవాలన్నాను, 'ఏం పనిమీద' అన్నాడు. స్వంతపని అన్నాను అప్పాయింట్‌మెంట్ ఉందా? అన్నాడు. లేదన్నాను. వెనక్కి వెళ్ళిపోమ్మంటాడా అని తటపటాయిస్తుండగా, సరే వెళ్ళండి అన్నట్టు తల తిప్పి సైగచేశాడు వాచ్‌మన్. సామ్రాజ్యమంటే మాటలా? కోట అన్న తర్వాత ద్వారపాలకులుండటం సహజమే. పెద్ద గుమ్మానికి ముందుగా, పక్కగా చిన్నగది ఉంది. దాన్లో మొదటగా కనిపించిన క్లర్కుని పలకరించాను. కూర్చోండి అన్నాడు. కూచున్నాను.




జగన్‌గారిని కలవాలన్నాను. ఎక్కడ్నుంచి వస్తున్నారన్నాడు. కిళ్ళీ బడ్డీ మంచి అని చెప్పమన్నాడు ఛాప్లిన్. వద్దని నేను, కాకినాడినుంచి అన్నాను. జగన్‌గార్ని కలవమని- ఎవరైనా పంపారా! లేక... మీరే వచ్చారా అన్నాడు. నేనే వచ్చానన్నాను. అనేసి, ఆలోచించాను. నా వాలకం అలా వుంది కాబోలు. జగన్‌గారితో పనిఉండే శాస్త్రీలా లేను కాబోలు, మహా అయితే ఎవరైనా పంపితేగాని, నాలాంటి వాడు జగన్‌గార్ని కలవలేడు కాబోలు. సరే నన్నాడు క్లర్కు- 'లోపలికి వెళ్ళండి— టెలిఫోన్ దగ్గరో అమ్మాయుంటుంది. ఆమె నడగండి. చీటీ రాసి లోపలికి పంపుతుంది.' అన్నాడు.

చాప్లిన్ తరపున కూడా థాంక్స్ చెప్పి, లోపలికి వెళ్ళాను. అది చిన్న వరండాయేగాని. యమ బిజీగా వుంది. రెండు టేబుళ్ళని దాటుకుని వెళ్ళే మూడో టేబిల్ మీద రెండు టెలిఫోన్లున్నాయి. కుర్చీలో ఒక అప్సరస ఉంది.

టేబిల్ ముందు నిటారుగా నిలబడి, చాతనైనంత గంభీరంగా పోజుపెట్టి హలో... అన్నాను.

తలెత్తి ప్రశ్నార్థకంగా చూసింది అప్సరస. నిజంగా అప్సరసే. ఆ కళ్ళలో నవ్వు గెంతుతోంది.

నా పేరూ, ఊరూ అప్సరసకి చెప్పి జగన్‌గార్ని కలుద్దామని వచ్చానండి అన్నాను.

ఈసారి కళ్ళలో నవ్వుని పెదాల మీదకి తెచ్చుకుని. చురుకుగా చూసింది అప్సరస.

—కలవడమంటే... పనేమిటో... చెప్పగలరా!అంది అప్సరస పొడిపొడిగా.

—ఏవి... ఏమీ లేదండీ... ఊరికే చూద్దామని... అని నసిగాను.

—ఆయన లేరండీ... ఇప్పుడే బైటకెళ్ళారు అనేసింది ఠక్కున. ఉలిక్కి పడి, ఆమె వైపు సూటిగా చూశాను. ఆమె పెదవులు చిగురాకుల్లా వణుకుతున్నాయి, కనురెప్పలు క్షణం వాలి, మళ్ళీ తేరు కున్నాయి. ఆడవాళ్ళు అబద్ధం చెప్పే టప్పుడు ఎలా ఉంటారో ఛాప్లిన్‌కు బాగా తెలుసు.

—లేరా? అన్నాను నేను చిన్నగా నవ్వుతూ. అలా నవ్వమని ఛాప్లినే చెప్పాడప్పుడు.

—మీకు పనేమైనా ఉంటే మేనేజర్ని కలవొచ్చు...ఫలానా పని అని చెప్తే... మీకు పనిఉండే సెక్షన్‌కి పంపుతాను- సాయపడే ధోరణిలో అంది అప్సరస- చిలకాకు పచ్చరంగు చీరలో అప్సరస మేనిఛాయ అపురూపంగా మెరుస్తోంది. మాట్లాడినప్పుడు ఆమె పలువరస మెరుపు తీగల్నే వెక్కిరిస్తోంది. ఆమె ముఖంలో సౌజన్యం పున్నమినాటి తెలిమబ్బులా కదుల్తోంది, జగన్ సెలక్షన్ ఏదైనా అద్భుతమే నన్నమాట.

—నాకు పనంటూ ప్రత్యేకంగా ఏమీ లేదండి... ఇదివరకు జగన్ నాకు ఫ్రెండు... చాలా ఏళ్ళయింది... చూద్దామని... అన్నాను.

—ఓ... అని సాలోచనగా చూసి, తల కొంచెం వాల్చి నావైపు క్షణంలోనే ఎగాదిగా చూసింది అప్సరస. -మీరు సాయంత్రం వస్తే...చూడొచ్చు జగన్ గార్ని...నాలుగ్గంటలకి పైన ఉంటారు- మీ పేరు చెప్తే... అంటూ ప్యాడ్ తీసింది.


జగన్ కారు దిగి ఆఫీసులోకి రావడం ఈ కళ్ళతో చూశాను. ఇందాక, ముందు గదిలో పెద్దమనిషి మాటలబట్టి చూసినా, జగన్ లోపలే ఉన్నట్టు నిర్ధారణ అవు తుంది. జగన్ లోపలే ఉన్నాడు! ఉన్నాడు! అని గొంతెత్తి అరుద్దామన్నాడు ఛాప్లిన్. ఊరుకోబెట్టి, నేనూ ఊరుకోవ డానికి విశ్వప్రయత్నం చేయాల్సి వచ్చింది.

—చెప్పండి...మీ పేరు?... అంది అప్సరస...చెప్పిన, పేరు ఆమెకి అర్థం కాలేదు. ఇదేం పేరు అన్నట్టు వింతగా చూసింది. —సాయంత్రం నాలుగ్గంటలకు పైన... అంది

—ఊఁహుఁ-తొందరేమీ లేదులెండి. మూడు నాలుగురోజుంటాను కదా... వీలైనప్పుడు కలుస్తాను... అనేశాను.

అప్సరస ముఖంలో సానుభూతి కొట్టొచ్చినట్టు కనిపించింది. అయితే ఛాప్లిన్‌కి మరొకరి సానుభూతి ఎందుకూ?

అప్సరస ముఖంలో, ముఖ్యంగా ఆ పెదవుల వొంపులో అదోలాంటి దిగులు, దాచినా దాగడంలేదు —సాయంత్రం వొస్తే- కలవొచ్చు మీరు... ఈలోగా- మీరొచ్చినట్టు చెబుతాను...



సూటిగా చూశాను అప్సరస వైపు- చెప్పకండి, అన్నాను. వింతగా చూసింది అప్సరస. -అంత ముఖ్యమేమీ కాదు- మునిగిపోయే పనేమీ లేదు... వీలైతే మరెప్పుడైనా వస్తాను...

నొచ్చుకున్నట్టు, ఆశక్తంగా చూసింది అప్సరస. నేను ఇవతలికి వచ్చేశాను.

వీధివెంట వెర్రిగా నడిచిపోతూ ఛాప్లిన్‌ని చెడతిట్టేశాను నేను. ఛాప్లిన్ నోరెత్త లేదు, రేగిన జుత్తు, చెమట కంపుకొడుతున్న స్లాకు, ముడతలుపడ్డ పాంటుతో, జిడ్డుకారే ముఖంతో వెళ్ళబట్టే కదా నాకు ఈ అవమానం? టిప్‌టాప్‌గా ట్రిమ్‌గా ఫుల్‌సూటులో అంటాసి డర్ కారులో దిగి ఉంటే, జగన్ని తప్పక కలిసే ఉండేవాణ్ణి. అప్పుడూ ఏం పని అని అప్సరస అడిగినప్పుడు- బిజనెస్ స్ట్రిక్ట్‌లీ కాన్ఫిడెన్షియల్, అని చెప్పి వుంటే చాలు, జగన్ ఎదురొచ్చే వాడేమో!

ఛాప్లిన్! యూ స్టుపిడ్! అని తిట్టాను. టోపీ తీసి శాల్యూట్ చేసి మళ్ళీ నెత్తిన పెట్టేసుకున్నాడు ఛాప్లిన్. మారుమాట్లాడ లేదు.

వ్యాపారలకీ డబ్బుకూ ఉన్న విలువ స్నేహానికీ నిరాడంబరత్వానికీ లేదని మారోమారు రూఢీ అయిపోవటంతో, మానవ భవిష్యత్తును తలుచుకుని విపరీత

మైన జాలి కలిగింది.

ఎండలో కాళ్ళీడ్చుకుంటూ అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళి ఒక పాత మిత్రుణ్ణి కలవలేకపోయాను. ఎంతో కొంతగా అవమానపడ్డాను కూడా. నష్టం నాకా, జగన్‌కా? నాతో పని ఉంటే అతను సరాసరి మా ఊరికే వచ్చి ఉండేవాడు. నాతో పని, నాలాంటివాళ్ళతో పని అతని కేం లేదు. అందుకే నాలాంటి వాళ్ళొస్తే లేరని చెప్పెయ్యమని ఆర్డర్‌చేసి ఉంటాడు అప్సరసకు.

ఇక నడిచే ఓపికలేక బస్‌స్టాప్‌లో నిలుచున్నాను. నాకు కావలసిన బస్సేదో నాకే తెలియదు. ఏ బస్సు వచ్చినా ఎక్కేసి కాస్తదూరం వెళ్ళాలనిపించింది. నే నెక్కదలచని బస్సులైనా లేవేనని తెలిసిపోయింది. చాలా సేపు ఏ బస్సూ రాలేదు. అంతలో అంతదూరానికి చూసి ఉలిక్కిపడ్డాను, వస్తోంది- అప్సరసే.

వస్తూ వస్తూ నన్ను చూసి నవ్వు మెరిపించింది అప్సరస. బాగా దగ్గరికి వస్తుండగా నడక వేగం తగ్గించింది కూడా, 'ఏమిటి ఎండలో బైలుదేరారే!,' అన్నాను సాహసవీరుడిలా. శహభాష్ అన్నాడప్పుడు ఛాప్లిన్.


లంచ్ టైం కదా...అదిగో బ్యాంక్ దాకా వెళ్దామని బైలుదేరాను... మీరు సాయంత్రం వస్తారు కదా మళ్ళీ... అంది స్నేహమాధుర్యం ఒలికిస్తూ అప్సరస.

నాకు చాలా ఉడుకుమోత్తనం వచ్చింది. జగన్ ఇప్పుడు ఆఫీసులో లేడని నన్ను నమ్మించాలనే కదూ ఈ ప్రయత్నం?

—రానుగానీ...మీరు నాతో అబద్ధం చెప్పారు... అనేశాను తెగించి.

అప్సరస కళ్ళు విచ్చుకున్నాయి. ఆమె పేలవంగా నవ్వుతూ తల దించుకుని, మళ్ళీ మామూలుగా చూసే ప్రయత్నం చేస్తోంది. అబద్ధం చెప్ప లేదని చెప్పే ధైర్యముందా ఆమెకు? అందుకే ఇంకా వంకరగానే అంది.... అలా ఎందుకు చెప్తారు ఎవరైనా!... మీరు జగన్‌గారికి ఫ్రెండు అంటున్నారుగా... అయితే సరాసరి ఫోన్‌చేసి అప్పాయింట్‌మెంట్ తీసుకోవాల్సింది. ఇప్పుడైనా కాసేపటికి ఫోన్ చేయండి- తమాషా మీకే తెలుస్తుంది ... అదీగాక ఫ్రెండ్సుకి విలువ ఇవ్వనివాడు కాదే జగన్‌గారు... మీరు సరాసరి ఇంటికెళ్ళొచ్చు... ఆ పక్కవీధిలోనే వాళ్ళ ఇల్లు. కాసేపట్లో లంచ్‌కి ఇంటికి వెళ్తారు...

ఆమె మాటతీరు చూస్తుంటే ఇంకా జాలి కలిగింది నాకు. ఆఫీసు బైటకూడా రిసెప్షనిస్టుగానే ఉంటోంది. కాని, ఇంత అందమైన అప్సరస చేయాల్సిన పని— తీరిగ్గా కూచుని అబద్ధాలు చెప్పడమా? ఛాప్లిన్ పుణ్యమాని నా బుర్రలో అప్పుడే మెరుపు మెరిపించింది.




—చూడండి మిస్... అన్నాను.

—భార్గవి!...అని అందించిందామె.

మిస్ భార్గవీ... జగన్‌గారితో మీరు అనుకునేంత స్నేహం లేదు నాకు. ఉంటే తిన్నగా వాళ్ళింటికే వెళ్ళి ఇంత డబ్బులో దొర్లుతున్నందుకు కంగ్రాట్స్ చెప్పి ఇంత గిరిగీసుకుని బ్రతుకుతున్నందుకు లెంపకాయోటి ఇచ్చుకునే వాణ్ణి. అదలా వుండనివ్వండి గాని... మీ ఆఫీసులో చాలామంది ఆడపిల్ల లుంటారు... వాళ్ళలో మిమ్మల్నే ఎందుకు రిసెప్షనిస్టుగా వేశాడో మీ కెప్పుడైనా తోచిందా?

బేలగా చూసింది అప్సరస. మరుసటి క్షణంలో ఆ ఎర్రటి ఎండలో ఆమె చెంపలు మరీ ఎర్రగా మెరిశాయి

—ఆడది అబద్ధమాడితే గోడకట్టి నట్టుందంటారు. అందమైన ఆడపిల్ల అబద్ధం చెబితే అది ఉక్కుగోడగా దిగబడిపోతుందంతే. అందుకే— మీరు రిసెప్షనిస్టయ్యారు. ఈజిట్?

అప్సర మరోసారి తలవంచుకొంది. బస్సువచ్చింది. ఎక్కడికనైనా చూడకుండా ఎక్కేసి, లాస్ట్‌స్టాప్ అన్నాను.

—బ్రేవో అన్నాడు ఛాప్లిన్.

ఆ రాత్రి హైదరాబాద్‌నుంచి రైల్లో వచ్చేస్తుండగా, జగన్‌ని చూసినట్లే అనిపించింది నాకు. -యస్ అన్నాడు ఛాప్లిన్.